# దుర్గమ్మ కథ

షావుకారు వీధిలో దుర్గమ్మగారి ఇల్లు రెండు వరసల ఇళ్లల్లో ప్రత్యేకంగా ఉంటుంది.

ఆ ఇల్లు అమ్మకానికి వుందని తెలిస్తే ఆ వీధిలోనే ఎవరో ఒకరు కొనుక్కునేవారు. కానీ దుర్గమ్మగారు వచ్చి గృహప్రవేశంకి రమ్మని వీధంతనీ బొట్టెట్టి పిల్చి భోజనాలు పెట్టింది. ఆ ఇల్లు చేజారిపోయిందని

వీధి వాళ్లే కాదు... ఊరి వాళ్లూ దుర్గమ్మ మీద ఈర్ష్య పడ్డారు. పై ఊరువాళ్లెవరో వచ్చి ఈ ఊళ్లో... అందులో అంత ముచ్చటైన ఇల్లు కొనేసిందంటే... కళ్లల్లో నిప్పులూ కడుపులో మంటా రగిలించుకున్నారు.

అసలు పెద్ద షావుకారు ఇల్లు అమ్ముతున్నానని ఎవరికీ చెప్పలేదు.

ఆయన అమ్ముదామనీ అనుకోలేదు. విశాఖపట్నంలో నేవీలో పెద్ద ఉద్యోగం చేస్తున్న కొడుకు దగ్గర ఓ వారం వుండి వద్దామని వెళ్లినవాడు అక్కడ ఖాయిలాపడ్డాడు- కదలకూడని స్థితిలో కూరుకుపోయాడు- ఇంక ఎట్టి పరిస్థితిలోనూ విశాఖపట్నం నుంచి సొంతవూరు ప్రయాణం కట్టడానికి వీల్లేదని తండ్రి చేత ఒట్టు పెట్టించుకున్నాడు. భార్య కూడా కొడుక్కే ఓటు వేసింది. సొంత ఊళ్లో ఇల్లు అమ్మెయ్యడానికి నిశ్చయించుకున్నారు.

విశాఖపట్నంలోనే దుర్గమ్మ అనే వ్యక్తి పరిచయమైంది. పెద్ద షావుకారుగారికీ... వాళ్ల కుటుంబానికీ... తండ్రీ కొడుకుల ఆలోచనల్లో ఉన్నప్పుడు 'ఆ ఇల్లు మాకు అమ్మెయ్యండి బాబూ... పట్నంలో ఉండి ఉండి... ఉండలేక పోతున్నాం' అంది. ఆవిడ అడిగిన వేళా విశేషమో... ఆవిడ ఇచ్చే రేటు కిట్టుబాటుగా అనిపించో వారం రోజుల్లో రాత కోతలూ రిజిస్ట్రేషనూ జరిగిపోయాయి. మరో వారానికల్లా పెద్దషావుకారి సరుకూ సరంజామా లారీలకెక్కి విశాఖపట్నం వచ్చేసింది.

గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోయిన ఈ తతంగం అంతా దుర్గమ్మగారొచ్చి బొట్టెట్టి పిలిచే వరకూ బట్టబయలు అవలేదు.

ఏమైనా దుర్గమ్మ ఆ ఇల్లు కొనుక్కుంది. ఆ వీధిలో ఇంక మనతోబాటు ఉండవల్సిందే కదా అనుకుని, ముఖం ముడుచుకున్నా మొహమాటానికి వచ్చారు. పైగా సత్యనారాయణ వ్రతం సెంటిమెంట్

కూడా వుంది కదా రాకపోతే... ఆ ప్రసాదం తీసుకోకపోతే... వ్రతకథలో షావుకారు కుటుంబం పడ్డ ఇబ్బందులు వస్తాయని భయపడి సకుటుంబ సపరివారంగా వచ్చారు. అద్భుతమైన భోజనం- ఆదరణ పూర్వకమైన ఆతిథ్యం, స్త్రీలందరికీ వెండి కుంకుంభరిణలూ, ఖరీదైన జాకెట్ పీస్‌లూ ఇచ్చింది. 'ఓహో' అనలేదు గానీ వచ్చిన వాళ్లందరి నోరూ నొక్కుకుపోయేలా చేసింది. కిట్టనివాళ్లు 'దొళ్లుదోవ - దూబరా' అన్నారు. కిట్టుబాటైనవాళ్లు మనసులో ఎలా వున్నా పైకి మెచ్చుకున్నారు. ఘనాపాటీల్ని పిలిపించి దండిగా సంభావనలిచ్చి శాలువాలు కప్పి మొక్కింది దుర్గమ్మ.

అసలీ దుర్గమ్మ ఎవరు- వాళ్లాయన ఏరి- ఈ ప్రశ్నలకి జవాబు వాళ్లు అడగలేకపోయారు- తెల్సుకోలేకపోయారు- రూపాయి కాసంత బొట్టు- పాపిట సింధూరం- మెడనిండా నగలూ ధగధగలాడే చెయ్యంతంచు జరీ పట్టుచీర... పార్వతీదేవిలా ఉంటుంది దుర్గమ్మ- ఆవేళ గృహప్రవేశం సత్యనారాయణ వ్రతమనే కాదు- ప్రతీరోజూ ఆవిడ అలంకరణే అది- స్నానమై హాల్లోకొచ్చేటప్పటికి, గర్భగుళ్లో మూలవిరాట్ అంత ముచ్చటగా, దణ్ణం పెట్టాలన్నంత సౌమ్యంగా ఉండేది- నవ్వుతూ పలకరించడం పన్లు పూర్తయ్యాక వీళ్లవీ వాళ్లవీ మంచి చెడ్డలు కనుక్కోవడం కావల్సిన సాయం చేయడం- చేయించుకోవటం దుర్గమ్మకి వెన్నతో పెట్టిన విద్య.

క్రమక్రమంగా దుర్గమ్మ ఆ షావుకారు పేటలో వీధి వాళ్లందరికీ ఆత్మీయురాలైపోయింది. ఎవరింట్లో ఏ శుభకార్యం జరిగినా ఆవిడే పెద్ద ముత్తైదువ.

చాకళ్లు... పనివాళ్లు... దగ్గర్నుంచి గుళ్లో పూజారులు ఊళ్లో పురోహితులు- కాస్తో కూస్తో- కళా- భక్తీ ఉన్నవాళ్లందరూ దుర్గమ్మకి

శిష్యుల్లా సేవకుల్లా భక్తుల్లా మారిపోయారు. ముఖ్యంగా స్త్రీలందరూ ఆవిడ చెప్పే మంచి మాటల కోసం మధ్యాహ్నం పూట పనులయ్యాక గుమి గూడేవాళ్లు.

గురువారం భజనలు, శనివారం భజనలు, శుక్రవారం పూజలూ, ఏకాదశి నోములూ, స్త్రీల వ్రతాలూ ఒకటేమిటి వచ్చిన ఆర్నెళ్లల్లో దుర్గమ్మ ఆ వీధి స్వరూపాన్నే మార్చేసింది.

ఎవరైనా బెంగలు, ఇబ్బందులు, దుఃఖాలు చెప్పుకుంటే మాటసాయంతో బాటు, చేతనైనంతలో చేతి సాయం కూడా చేసేది.

పేదవాళ్లింట్లో పెళ్లి ఉందని తెలిస్తే పెళ్లి చూపుల దగ్గర్నుంచి అన్నింట్లోనూ ఉత్సాహంగా పాల్గొనేది. ఏ బట్టలు కట్టుకోవాలో ఎలా మాట్లాడాలో అన్నీ చెప్పేది. గోరింటాకు పెట్టటం, దగ్గర్నుండి ఆ అమ్మాయిని ముస్తాబు చెయ్యటం అన్నీ ఆవిడ ట్రైనింగే. వాళ్ల తల్లితండ్రులకి వచ్చే పెళ్లివాళ్లతో వీళ్లు ఎలా మాట్లాడాలో కౌన్సిలింగ్ చేస్తుండేది.

ఇంక పెళ్లి నిశ్చయమై ముహూర్తాలు పెట్టాక... పెళ్లి కూతురికి ఒక పట్టుచీర ఇచ్చేది. పెళ్లికూతురు తండ్రికి ఖర్చులకి ఒక ఐదారు వందలైనా ఇచ్చేది. ఎవరింట్లో పెళ్లైనా ఆవిడ ఆనందం వర్ణనాతీతం.

ఇంత ఖరీదైన స్త్రీ, పెళ్లికూతురు వెనక ఉందంటే మగపెళ్లివాళ్లకి ఆశలు పెరుగుతాయేమోనని ఆడపెళ్లివాళ్ల గుండెల్లో చిన్న గుబులు కూడా ఉండేది.

అయినా ఆవిడ వీఐపీ- పెద్ద ముత్తయిదువు.

అరవై ఏళ్ల వయస్సులో నలభై ఏళ్ల చురుకుతనంతో ఉండే దుర్గమ్మ

ఆ వూళ్లో అందరికీ ప్రేరణగా ఉంటోంది.

పెళ్లి హడావుడిలో పెద్దముత్తయిదువులా పసుపు కుంకం తీసుకుని వచ్చాక...

అంతటి ఆనందం కరిగి కన్నీళ్లయే విషయం దుర్గమ్మకీ ఆవిడ తలదిండుకూ మాత్రం తెల్సు.

అవును... దుర్గమ్మ కథలో దాగిన విషాదం మరచిపోవటానికీ చేసిన పాపం ప్రక్షాళన చేసుకోవటానికీ ఈ దానాలూ, పుణ్యాలూ నవ్వుతో నటనలు-

ప్రతీ చీకటి రాత్రీ 20 ఏళ్లుగా ఆమె గుండెని పిండేస్తూనే ఉంది. ఆ పరిస్థితినీ పరిసరాల్నీ మర్చిపోవటానికే విశాఖపట్నం నుంచి ఈ మారుమూల పల్లెటూళ్లో ఇల్లు కొనుక్కుని అజ్ఞాతంగా ఉంటూ... ఆనందాన్ని కొనుక్కుంటోంది.

✦ ✦ ✦

దుర్గ చాలా అందమైన, చురుకైన పిల్ల.

ఇంటర్మీడియట్లో క్లాసు ఫస్టు. ఆటపాటల పోటీల్లో ఎప్పుడూ బెస్టే-

కాలేజీ కుర్రవాళ్లంతా ఆమెకి ఫేన్సే.

అందులో రాము ఆరాధనకీ, ఆప్యాయతకీ, ప్రేమకీ, మనసూ తనువూ అర్పించేసింది. నిజానికి దుర్గలో అంత తొందరబాటుతనం లేదు. కానీ కాలేజీ ఫ్రెండ్సందరూ ఒకసారి పిక్నిక్‌కి వెళ్లినప్పుడు ఏకాంతాన్ని ఏర్పాటు చేసి వీళ్లిద్దర్ని ఏకం చేశారు.

దుర్గ గర్భవతి అయింది.

రాము ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని ఇంట్లో చెప్పాడు. పెద్దవాళ్లు 'ససేమిరా' అన్నారు.

రాము నిరాహార దీక్ష చేశాడు. పెద్దవాళ్లు దిగలేదు.

రామూని ఇల్లు కదలకుండా కట్టుదిట్టం చేశారు.

అసమర్థుడి ప్రేమయాత్ర- ఒక దుప్పటితో ముగిసిపోయింది.

దుప్పటితో ఉరేసుకున్న కొడుకు శవాన్ని కేసులేకుండా మసి చేశారు రాము తండ్రిగారు.

దుర్గకీ సంగతి తెలిసేటప్పటికే మూణ్నెళ్లు గడిచిపోయాయి. పెళ్లి కాకుండా తల్లి కాబోతున్న మనవరాల్ని చూసి ముసలి అమ్మమ్మ షాకైంది. వీకైంది- లక్షల ఆస్తి ఆ వారసురాలికి అప్పగించి వెళ్లిపోయింది.

ఇప్పుడు... నిజమైన అనాథ అయింది దుర్గ- డబ్బుంది గనక పెద్ద చిక్కులూ గట్టి కష్టాలూ లేవు- జగదాంబా సెంటర్లో సొంత ఇంటిని అద్దెకిచ్చేసింది- సీతమ్మధారలో ఇల్లు తీసుకుని ఉంటోంది.

దుర్గకి అమ్మాయి పుట్టింది. రామలక్ష్మి అని పేరు పెట్టింది.

రామలక్ష్మి ఇంటర్మీడియట్లో ఉన్నప్పుడు అచ్చం అమ్మే- పోలికతో బాటు దౌర్భాగ్యం తోడొచ్చింది.

ఎవరో కుర్రాణ్ని తీసుకొచ్చింది- దుర్గ షాకైంది కూతురు పరిచయాలకి. భయపడ్డంతా జరిగింది. ఆ అబ్బాయి ఇంటికి వెళ్లి, వాళ్ళ అంగీకారం పొందాకే ప్రేమా పెళ్లి అని ఆంక్ష పెట్టింది.

కుర్రాడు వణికిపోయాడు- మా ఇంట్లోవాళ్లు వప్పుకోరన్నాడు. మీ

కులం తక్కువ అంటారు అని, మీరు మా పెళ్లి చెయ్యండన్నాడు.

దుర్గకి నమ్మకం లేదు- పెద్దల అంగీకారం ముఖ్యం... అని ఆ ప్రయత్నాలు చేయడం ప్రారంభించింది.

రామలక్ష్మి ప్రియుడూ 'మా గురించి వెతకద్దని' లెటర్ పెట్టి వెళ్ళిపోయారు.

ఇరవైయ్యేదు ఏళ్లు గడిచిపోయాయి.

రామలక్ష్మి గురించి ఏ వార్తా లేదు. రామలక్ష్మికి పిల్లపుడితే ఈ పాటికి పెళ్లీడు వచ్చి ఉండేది.

దుర్గ దుర్గమ్మ అయిపోయింది. దుఃఖానికి, ఎదురు చూపులకీ ఇంక అర్థం లేదనిపించింది.

ఉన్న ఊళ్లో ఇంక ఉండటం అనవసరం అనిపించింది.

\+ + +

షావుకారు పేటలో దుర్గమ్మ ఇల్లు ఎప్పుడూ కోలోహలంగానే ఉంటుంది.

రామలక్ష్మి పుట్టిన్రోజుకి ఏదో వంకని పూజో వ్రతమో అని పదిమందికి అన్నం పెడుతుంది దుర్గమ్మ.

పేపర్లో శుభాకాంక్షలు ప్రకటిస్తుంది.

ఆ కూతురు నుంచి స్పందన రాదు.

ఆ రాత్రుళ్లు ఆవిడ కన్నీళ్లు ఆగవు.

రామలక్ష్మి ఎలా ఉందో... పాపం!!